## ఐటీ రంగంలో హైదరాబాద్‌ను దేశంలోనే నం.1 స్థానానికి తీసుకువెళ్తాం

- టీటా కు సముచిత ప్రాధాన్యం కల్పిస్తాం
- ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



టీహబ్‌లో డబ్ల్యూటీఐటీసీ, టీటా సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, నిర్వాహకులు సందీప్ మక్తల తదితరులు

సిటీబ్యూరో, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : వరల్డ్ తెలుగు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కౌన్సిల్ (డబ్ల్యూటీఐటీసీ), తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్(టీటా)కు సముచిత ప్రాధాన్యం కల్పిస్తామని రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. టీ హబ్ వేదికగా శుక్రవారం డబ్ల్యూటీఐటీసీ నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో ఐటీ అభివృద్ధికి కృషి చేసిన సందీప్ మక్తలను ఈ సందర్భంగా అభినందించారు. ఐటీ రంగంలో హైదరాబాద్ దేశంలోనే నంబర్ వన్‌గా ఎదిగేలా కృషి చేస్తామన్నారు. ప్రతి ఏడాది ఆరంభంలోని మొదటి శుక్రవారం అరైవల్ సమ్మిట్ పేరుతో డబ్ల్యూటీఐటీసీ, టీటా సంయుక్తంగా నిర్వహిస్తుందన్నారు. బెంగళూరు, హైదరాబాద్ నగరాలను కంట్రీ కజిన్స్ అని కర్ణాటక ఐటీ మంత్రి ప్రశంసించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో టీ హబ్ సీఈఓ ఎం.ఎస్.రావు, శ్రీనివాస్ తాలుక, వింగ్ కమాండర్ అనీష్, డబ్ల్యూటీఐటీసీ ముఖ్య సలహాదారుడు ఈవీ శ్రీనివాస్, సతీష్, నెల్లి ప్రసన్న, మహేశ్ కొనగాలు, ఇలియాస్, శ్రీజ ఆకుల తదితరులు పాల్గొన్నారు.

## రికార్డు సృష్టించిన పద్మజ సుజికి
## 26 నెలల్లో 10వేల వాహనాలు విక్రయం



చివరి వాహనాన్ని కొనుగోలు చేసిన కస్టమర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న వరుణ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ దేవ్, వరుణ్ నెక్సా డైరెక్టర్ డి.కె.రాజు, పద్మజ సుజికి జీఎం ప్రవీణ్‌కుమార్

జూబ్లీహిల్స్, జనవరి 5 : సుజికి టూ వీలర్స్ అగ్ర శ్రేణి డీలర్ పద్మజ సుజికి రికార్డ్ స్థాయి సేల్స్‌తో ఆలిండియా నంబర్-1 అవార్డును సొంతం చేసుకోవడం అభినందనీయమని వరుణ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ దేవ్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలో జరిగిన వేడుకల్లో ఆయన మాట్లాడుతూ అనతి కాలంలోనే రికార్డు స్థాయి సేల్స్ సాధించడమే కాకుండా కస్టమర్లను సంతృప్తి పర్చడంలో నంబర్-1 గా నిలిచిందన్నారు. పద్మజ సుజికి కేవలం 26 నెలల వ్యవధిలోనే 10 వేల వాహనాలను విక్రయించడం విశేషమని తెలిపారు. ఈ సందర్భంగా 10 వేల వాహనాలలో చివరి వాహనాన్ని కొనుగోలు చేసిన కస్టమర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినోద్ కుమార్, రీజనల్ మేనేజర్ వెంకట్, సీఈఓ శ్రీలత, జీఎం ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సక్సెస్‌ఫుల్ ఉమెన్స్ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్



సిటీబ్యూరో, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : వీఐటీ బిజినెస్ స్కూల్ (వెల్లూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) చెన్నైలో సక్సెస్‌ఫుల్ ఉమెన్స్ లీడర్ షిప్ కాన్‌క్లేవ్‌ను వీఐటీ ఈడీ అండ్ ఉమెన్ అఫ్ ప్రతినిధి డాక్టర్ సంధ్య పెంటారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగ అసమానతలు లేని సమాజం కోసం పాటుపడాలని సూచించారు. వీఐటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శేఖర్ విశ్వనాథన్, వీసీ డాక్టర్ వీఎస్ కాంచన భాస్కరన్ మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం కీలకంగా పనిచేయాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. 'జర్నీ టు ది టాప్' అశంపై ప్రముఖ సైంటిస్టు డాక్టర్ వల్లి అరుణాచలం మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఎంతో మంది రాణిస్తున్నారని వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళా సైంటిస్టులు, పారిశ్రామికవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.

# సబర్మతిలా.. మూసీ

- మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌పై మరోసారి అధ్యయనం
- అహ్మదాబాద్ పర్యటనకు వెళ్లిన హెచ్‌ఎండీఏ జాయింట్ కమిషనర్ అమ్రపాలి
- కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ప్రణాళికలు సిద్ధం



సిటీబ్యూరో, జనవరి 5 (నమస్తే తెలంగాణ): మూసీ పరివాహక ప్రాంతం సుందరీకరణపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరంలో ఉన్న సబర్మతి నది తరహాలో తీర్చిదిద్దేలా ప్రణాళికలను వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలోనే మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీ) డైరెక్టర్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి అమ్రపాలిని ఇటీవల నియమించింది. వారం రోజుల కిందట మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధిపై ప్రత్యేకంగా సమీక్ష జరిపిన సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యాలను నిర్దేశించారు. ఇందులో భాగంగానే ఎంఆర్‌డీసీ డైరెక్టర్, హెచ్‌ఎండీఏ జాయింట్ కమిషనర్ అమ్రపాలి రెండు రోజుల క్రితమే అహ్మదాబాద్ పర్యటనకు వెళ్లారు. ఆ నగరంలో ఉన్న సబర్మతి నది తీర ప్రాంతంలో అక్కడి ప్రభుత్వం అభివృద్ధి చేసిన తీరును, తీసుకున్న చర్యలు, ఇతర అంశాలను సమగ్రంగా అధ్యయనం చేయనున్నారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తే హైదరాబాద్ మహానగర రూపురేఖలే మారిపోయే ప్రాజెక్టు కావడంతో ప్రభుత్వం దీన్ని 36 నెలల్లోనే పూర్తి చేయాలని లక్ష్యాన్ని పెట్టుకున్నది. పీపీపీ పద్ధతిలో ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

### గతంలోనే సమగ్ర సర్వేలు, అధ్యయనాలు

మూసీ సుందరీకరణపై గత కేసీఆర్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసింది. మూసీ నది పరివాహక ప్రాంతాన్ని 40 కి.మీ పొడవునా సుందరీకరణ పనులు చేసేందుకు మొదట డ్రోన్ సర్వే చేపట్టింది. ఆ తర్వాత దేశ, విదేశాలకు చెందిన కన్సల్టెంట్ల అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన డిజైన్లను రూపొందించి పెట్టారు. హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ అధికారులు పలుమార్లు గుజరాత్‌లోని సబర్మతీ నది అభివృద్ధిని అధ్యయం చేసేందుకు వెళ్లి వచ్చారు. అదేవిధంగా విదేశాల్లోనూ నగరంలోని నదీ పరివాహక ప్రాంతాల అభివృద్ధి ఎలా చేశారన్న దానిపైనా అధ్యయనం చేసి వచ్చారు. ఇలా మూసీ సుందరీకరణకు గత కేసీఆర్ ప్రభుత్వం అన్ని కోణాల్లో అధ్యయనం చేయడంతో పాటు అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా, ఆదాయ వనరుగా మార్చేందుకు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో మూసీ సుందరీకరణ ప్రాజెక్టును చేపట్టాలని అంతా సిద్ధం చేశారు. కేవలం సుందరీకరణ మాత్రమే కాకుండా మూసీ నదిని వైవిధ్యంగా, విభిన్నంగా, కొత్త సొబగులతో అలరించేలా ట్రాఫిక్ చిక్కులు తీర్చడంతో పాటు ఇటు హైదరాబాద్ నగరం, తెలంగాణ రాష్ట్ర సంస్కృతీ, సంప్రదాయాలు ప్రతిబింబించేలా తగిన వాస్తు శిల్పాలతో ఉండాలని ప్రభుత్వం భావించి 14 చోట్ల ఐకానిక్ బ్రిడ్జిలను నిర్మించాలని నిర్ణయించి వాటికి టెండర్లు సైతం పిలిచింది. పలు చోట్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయగా, ప్రాథమికంగా భూమిని చదును చేసే పనులను ఎన్నికల ముందే హెచ్‌ఎండీఏ చేపట్టింది.

## మహాలక్ష్మి పథకంలో..
# 7కోట్ల మంది ప్రయాణం

- సంక్రాంతికి ఉచిత ప్రయాణమే
- వన భోజన కార్యక్రమంలో ఎండీ వీసీ సజ్జనార్



ఆర్టీసీ ఉద్యోగినిని శాలువాతో సన్మానించి అభినందిస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

హైదరాబాద్, జనవరి 5(నమస్తే తెలంగాణ)/ బండ్లగూడ: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా ఇప్పటివరకు ఏడు కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసినట్లు సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం రాజేంద్రనగర్ బస్సు డిపోలో నిర్వహించిన వన భోజన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. త్వరలోనే ఆర్టీసీ సిబ్బందికి పీఆర్సీపై ప్రభుత్వంతో చర్చిస్తామని తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగానూ మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీ కృష్ణకాంత్, ఆర్ఎం వరప్రసాద్, డిప్యూటీ ఆర్ఎంలు విజయభాను, జగన్, ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనాథ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


## పదవ తరగతి పరీక్షలపై కలెక్టర్ సమీక్ష



సిటీబ్యూరో, జనవరి 5(నమస్తే తెలంగాణ) : చదువులో వెనకబడిన వారిని గుర్తించి, వారికి స్కూళ్లలోనే ప్రత్యేక శిక్షణ ఇప్పించే విధంగా ప్రధానోపాధ్యాయులు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. పరీక్షల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో హిమాయత్‌నగర్‌లోని కేశవ మెమోరియల్ స్కూల్ ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ పదవ తరగతి పరీక్షలపై ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు.

## ప్రతి ఒక్కరికీ పర్సనలైజ్డ్ ఔషధాలు అందించాలి

ఏఐజీ చైర్మన్ డా.నాగేశ్వర్‌రెడ్డి



సిటీబ్యూరో, జనవరి 5(నమస్తే తెలంగాణ): ప్రతి దవాఖానలో పర్సనలైజ్డ్ మెడిసిన్ అనేది ప్రామాణిక అభ్యాసంగా మారాలని, ఈ అంశంపై పరిశోధనలు జరగాలని ఏఐజీ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని ఉప్పలూరి కె అండ్ హెచ్ పర్సనలైజ్డ్ మెడిసిన్ క్లినిక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'జెనికనెక్ట్ఆర్ఎక్స్'ను డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ కచ్చితమైన సమర్థవంతమైన, సరసమైన పర్సనలైజ్డ్ ఔషధాలను అందించడం అనేది కీలకమన్నారు. డాక్టర్ వినయేందర్ మాట్లాడుతూ జెనికనెక్ట్ఆర్ఎక్స్ జన్యు సమాచారాన్ని డికోడ్ చేయడం ద్వారా డ్రగ్ డిస్కవరీలో విప్లవాత్మక మార్పులు చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డా.కళ్యాణ్ ఉప్పలూరి, డా.హిమ చల్లా తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల జేబులో ఫోన్ నంబర్ పెట్టండి

*ఎగ్జిబిషన్ సొసైటీ పబ్లిసిటీ సబ్ కమిటీ కన్వీనర్ జీవీ రంగారెడ్డి*



ఎగ్జిబిషన్ సొసైటీ పబ్లిసిటీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ కన్వీనర్ జీవీ రంగారెడ్డి, రవియాదవ్

అబిడ్స్, జనవరి 5: ఎగ్జిబిషన్‌కు వచ్చే సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నట్లు ఎగ్జిబిషన్ సొసైటీ పబ్లిసిటీ సబ్ కమిటీ కన్వీనర్ జీవీ రంగారెడ్డి పేర్కొన్నారు. ఎగ్జిబిషన్ మైదానంలోని పబ్లిసిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మట్లాడుతూ ఎగ్జిబిషన్ సందర్శనకు వచ్చేవారు తమతో పాటు చిన్న పిల్లలు ఉంటే వారి జేబులో తల్లి, తండ్రి పేరు, ఫోన్ నంబర్, చిరునామా రాసిన చీటిని తప్పనిసరిగా ఉంచాలని, ఒకవేళ పిల్లలు తప్పిపోతే వెంటనే గుర్తించేందుకు వీలు కలుగుతుందన్నారు. జనవరి 1న ప్రారంభమైన ఎగ్జిబిషన్‌కు సందర్శకుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నదని, ఈ నేపథ్యంలో కుటుంబ సమేతంగా ఎగ్జిబిషన్ సందర్శనకు వచ్చే సందర్శకులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎగ్జిబిషన్‌లో తప్పిపోయిన చిన్న పిల్లలను పబ్లిసిటీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరం వద్దకు తీసుకువచ్చి తల్లి, తండ్రి వచ్చేంత వరకు జాగ్రత్తగా చూసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో రంగారెడ్డితో పాటు పబ్లిసిటీ సెల్ రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు.